భవానీమాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

సిర్గాపూర్, మే 21 : మండలం పరిధిలోని వాసర్ మున్యా నాయక్‌తండాలో భవానీ సేవాలాల్ విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. బుధవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తండాను సందర్శించి, ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయనను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జగదీశ్ మహరాజ్, రాసింగ్, లచ్చు నాయక్, బిక్కు, తౌర్యా, శంకర్, బద్దునాయక్, పుండ్లిక్, తుకారం, వెంకట్, తండాప్రజలు ఉన్నారు.

వర్షం ముసుగులో పరిశ్రమల వ్యర్థాల విడుదల

బహిరంగ ప్రదేశాల్లోకి వర్షంతో రసాయన వ్యర్థ జలాలు విడుదల

జిన్నారం, మే 21 : జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడతో పాటు బొల్లారం పారిశ్రామిక వాడలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పరిశ్రమల యాజమాన్యాలు పెద్ద ఎత్తున రసాయన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురిసినప్పుడల్లా యాజమాన్యాలు ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని, చెరువులు, కుంటలను హాని కలిగించేలా రసాయన వ్యర్థ జలాలను యథేచ్ఛగా విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని విష్ణు కెమికల్ పరిశ్రమ వర్షం ముసుగులో పెద్ద ఎత్తున రసాయన వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేసిందని వాపోయారు. ఈ ఘటనపై స్థానికులు వెంటనే పీసీబీ అధికారులకు సమాచారం అందించారు. బాధ్యులైన పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వాడ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అక్రమ మట్టి రవాణాపై కేసు నమోదు

జిన్నారం, మే 21: జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో కొంత కాలంగా అక్రమ మట్టి రవాణా జోరుగా సాగుతుందని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై బొల్లారం పోలీసులు స్పందించి కేసు నమోదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి కిష్టయ్యపల్లి గ్రామ సమీపంలోని ఇటుక బట్టీలకు, అదేవిధంగా పలు పరిశ్రమలకు టిప్పర్లతో భారీగా మట్టిని తరలిస్తున్నా ఘటనల నేపథ్యంలో బుధవారం బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి రెండు జేసీబీలతోపాటు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనుమతులకు విరుద్ధంగా రవాణా చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు

జేసీబీ చదును చేస్తున్న సిబ్బంది

పుల్కల్, మే 21 : ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. మండల కేంద్రం పుల్కల్‌లో దుమ్ము, ధూళితో ప్రయాణికుల ఇబ్బందులు అనే కథనం ఈ నెల 19న 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రచురితమైన కథనం మేరకు అధికారులు స్పందించారు. రెండు రోజుల్లో రోడ్డు పక్కన పోసిన కంకర కుప్పలను బుధవారం జేసీబీ, రూలర్ సాయంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కంకర మిశ్రమం పోసి చదును చేశారు. దుమ్ము, ధూళి రాకుండా రోడ్డును బాగు చేయడంతో ప్రయాణికులు, రోడ్డు పక్కన ఉన్న షాపు నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా జొన్నల కొనుగోళ్లు

1400 మంది రైతులు.. 41 వేల క్వింటాళ్లు కొనుగోలు

జొన్నల కాంటా చేపడుతున్న సిబ్బంది

సిర్గాపూర్, మే 21 : మండలంలోని బొక్కస్‌గాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో యాసంగి సీజన్ జొన్నలు కొనుగోలు ప్రక్రియ జోరుగా కొనసాగుతుంది. ఈమేరకు బుధవారం స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో జొన్నల కాంటా నిర్వహించారు. 2000 జొన్నల టోకెన్లు రైతులకు ఇచ్చామని, ఇందులో 1400 మంది రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసి వాటి బిల్లులకు కూడా పూర్తి చేశామని స్థానిక సీఈవో సతీష్ పాటిల్ తెలిపారు. ఏప్రిల్ 25న కొనుగోలు ప్రారంభించగా, ఇప్పటిదాక 82వేలు బస్తాలు, 41వేల క్వింటాళ్లు జొన్నలు రైతుల నుంచి కొన్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 48 వేల సంచులు మార్కెట్ గోదాంలకు తరలించామని చెప్పారు. సిబ్బంది అజయ్, రైతులు తదతరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా చేపట్టాలి

అందోల్, మే 21 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరగా కొనుగోలు చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ అన్నారు. బుధవారం అందోల్, అల్మాయిపేట్, చందంపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సీఐటీయూ నాయకులతో కలిసి పరిశీలించారు. రైస్ మిల్లర్లు సైతం రైతులను అందినకాడికి దోచుకుంటున్నారని వీటిపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, సీపీఎం డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు ప్రభాకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అందోల్, మే 21 : విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని వినియోగదారుల ఫోరం చైర్మన్ నాగేశ్వర్ రావు సూచించారు. బుధవారం జోగిపేట ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పరిష్కార వేదిక (సదస్సు) నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఏమైనా సమస్యలుంటే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని వారు స్పందించకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కమిటీ సభ్యులు వెంకట్, డీఈ శ్రీనివాస్, ఏడీఈ శ్రీనివాస్‌రావు, జోగిపేట, నారాయణఖేడ్ డివిజన్ ట్రాన్స్ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు భానుప్రకాశ్

సిర్గాపూర్, మే 21 : విద్యా ప్రమాణాల పెంపు కోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డీఆర్‌పీ శివకుమార్ స్వామి, ఎంఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం సిర్గాపూర్ కస్తూర్బా విద్యాలయంలో మండలంలోని టీచర్లకు రెండో రోజు ఎమ్మార్పీలు శిక్షణ ఇచ్చారు. ఇందులో ప్రధానంగా ధ్వని అక్షర గుర్తింపు, పలు కృత్యాలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంగ్లిషు, తెలుగు, సైన్స్, మాథ్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధనను సులభంగా నేర్పించాలని సూచించారు.

శిక్షణతో మెరుగైన విద్య

సంగారెడ్డి కలెక్టరేట్, మే 21: ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణ ద్వారా పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తారని రాష్ట్ర పరిశీలకుడు అవుసల భానుప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డిలోని కరుణా స్కూల్ ఏసెంటర్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. కోర్సు డైరెక్టర్ నర్సింహులు, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ పూర్ణ కృష్ణ, సత్తయ్య, నాగభూషణం, రవి కుమార్, లీలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

- గాలిదుమారానికి విరిగిపోయిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలు
- ఝరాసంగం మండలం ప్యాలవరంలో పొంగి పొర్లిన వాగులు

ఝరాసంగం మండలంలోని ప్యాలవరం గ్రామ శివారులో పొంగిపొర్లుతున్న వాగులు

హత్నూర : గుండ్లమాచునూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు

జహీరాబాద్ /ఝరాసంగం, మే 21 : మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు బోరేగాం, ప్యాలవరం, బోప్పన్‌పల్లి తదితర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీగా వర్షం కురిసింది. ఉన్నట్టుండి మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లోని చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. కరెంట్ తీగలు సైతం తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని ప్యాలవరం గ్రామ శివారులోని వాగు పొంగిపొర్లడంతో పొలాలకు వెళ్లిన రైతులు, కూలీలు ఇబ్బందులకు గురయ్యారు. కుప్పనగర్ గ్రామ చౌరస్తాలో వర్షపునీరు నిల్వడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గాలి దుమారంతో చెట్ల విరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలకు ఇబ్బందులు పడ్డారు. మామిడి చెట్లకు కాసిన కాయలు, పండ్లు నేలరాయిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు, వ్యాపారులు వాపోయారు.

అకాల వర్షం..ఆందోళనలో రైతన్నలు

హత్నూర, మే 21 : ఆరుగాలం కష్టపడి పంటసాగుచేసిన రైతన్నలకు అకాల వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఓవైపు ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతుండగా మరోవైపు అకాల వర్షాలకు ఎండినధాన్యం తడిసి ముద్ధవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హత్నూర మండలంలో పలుగ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో రాత్రింబవళ్లు రైతన్నలు ధాన్యంకుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చురుకుగా చేపట్టాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పస్తాపూర్ గ్రామ సమీపంలో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

జహీరాబాద్, మే 21 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పరిశీలించారు. బుధవారం ఝరాసంగం మండల పరిధిలోని కేంద్రీయ విద్యాలయం, నిమ్జ్ ప్రాజెక్టు ప్రత్యేక రోడ్డు ప్రారంభోత్సవం, జహీరాబాద్ పట్టణ సమీపంలోని హుగ్గెలి చౌరస్తాలో బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ, జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా సమీపంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమాలను సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పనులను పరిశీలించారు. జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ గ్రామ సమీపంలోని హెలిప్యాడ్, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. బహిరంగ సభ ప్రాంగణంలో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్, పార్కింగ్, వైద్య శిబిరాలు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత శాఖా అధికారులు, సిబ్బందితో కలిసి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. కలిసి కట్టుగా పనిచేసి సీఎం పర్యటన విజయవంతం చేయాలన్నారు. వారి వెంట జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, డీఎస్పీ సైదా, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఆయా మండల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం, నిమ్జ్ రోడ్డును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ఝరాసంగం, మే 21 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో 10ఎకరాల స్థలంలో రూ. 26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం, హుగ్గెల్లి చౌరస్తా నుంచి బర్దిపూర్ శివారులోని నిమ్జ్ వరకు రూ.100 కోట్లతో 9.5 కిలోమీటర్ల 4 లేన్ రోడ్డును రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ శెట్కార్, జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కేంద్రీయ విద్యాలయం నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా సందేశాలు పంపించారు. సొంత భవనం కోసం ప్రభుత్వం మాచ్నూర్ శివారులో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) ద్వారా రూ. 26 కోట్లను కేటాయించింది. ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు సరిపడా రెండేసి గదులు చొప్పున గదులను నిర్మించారు. పాఠశాల క్యాంపస్ చుట్టూ ప్రహరీ, ఇదే ప్రాంగణంలో సిబ్బంది నివాస గృహాలు, శౌచాలయాలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, ర్యాంపులు నిర్మించారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్, క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, కోకో, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా, మంజీరా, మిషన్ భగీరథ నీటినీ పైప్‌లైన్ ద్వారా పాఠశాలకు అనుసంధానం చేశారు. విశాలమైన ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల నిర్మాణం పూర్తి చేశారు. అక్టోబర్ 14న కొత్త భవనంలోకి సామగ్రిని, విద్యార్థులను తరలించారు. ఆరు నెలల నుంచి సొంత భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి. గతేడాది కేంద్రీయ విద్యాల యం నూతన భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించినప్పటికీ మరల రేపు సీఎం జహీరాబాద్ పర్యటనలో భాగంగా ఈ భవనాన్ని కూడా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాటు చేశారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

గుమ్మడిదల: అనంతారం సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

జహీరాబాద్, మే 21 : రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిగదిగుబడులను పొందాలని బసంతపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త తబుసం ఫాతిమా అన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని గోటిగార్‌పల్లిలో రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై కందివ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ హరితో పాటు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి హస్మొద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు సరస్వతి, భూ మయ్య, ప్రవీణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, మే 21 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారులు రైతులకు సదస్సుల ద్వారా అవగాహన కలిగిస్తున్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు, మండలంలోని అనంతారం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఈవో నిఖిత ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ హేమలత, డాక్టర్ జానకీ శ్రీనాథ్, డాక్టర్ శివాని, డాక్టర్ స్రవంతి పాల్గొని రైతులకు వివిధ పంటలపై అవగాహన కలిగించారు. ఈకార్యక్రమాలకు ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతారంలో ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తల సదస్సులో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ యూరియాకు బదులు కాంప్లెక్స్ ఎరువుల ఉపయోగం సూక్ష్మపోషకాల ప్రాముఖ్యతను, టమాటాలో వచ్చే సాధారణ తెగులు, నర్సరీ నిర్వహణ విషయాలను వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి అనుషా, వ్యవసాయవిస్తరణ అధికారి (ఏఈవో) ప్రణవి రైతులకు లభ్యమవుతున్న వివిధ రకాల సబ్సిడీలపై అవగాహన కలిగించారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

దుకాణాదారులకు ఈపాస్ మేషిన్లు అందజేస్తున్న అధికారి సత్యనారాయణ

రాయికోడ్, మే 21 : వ్యవసాయం చేస్తున్న రైతులకు నాణ్యవంతమైన ఎరువులు, విత్తనాలను అందజేయాలని రాయికోడ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న రైతు వేదికలో మండల ఫర్టిలైజర్స్ దుకాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దుకాణాదారులకు ఈపాస్ మేషన్లను పంపిణీ చేశారు. లైసెన్సు కలిగిన డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. సమవేశంలో రాయికోడ్, వట్‌పల్లి, మునిపల్లి మండలాల ఏవోలు సారికరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనిత, ఏఈవోలు ఉన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 21 : సీఎం పర్యటనకు ఏర్పాట్లను గురువారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. హెలిప్యాడ్ పనులు, ప్రజావేదిక సభ ఏర్పాటు ఎంత వరకు వచ్చాయో అని అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వేదిక వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజీ ఏర్పాట్లు, స్టేజీ అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు, వివిధ శాఖ ల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మాణిక్‌యాదవ్

పటాన్‌చెరు, మే 21 : మణిధర్ వర్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం అమీన్‌పూర్ మున్సిపాల్ పరిధిలో ఉన్న ఐలాపూర్ మైదానంలో మహేశ్వర్ అనే మహిళ కారు డైవింగ్ నేర్చుకుంటున్న సమయంలో ప్రమాదం జరిగింది. కారు ప్రమాదంలో మణిధర్ వర్మ మృతిచెందగా, ఏకవాణికి గాయలైట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి సాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

జిన్నారం తహసీల్దార్ దేవదాస్

జిన్నారం, మే 21 : మండల తహసీల్దార్‌గా దేవదాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై జిన్నారం మండలం వచ్చారు. ఇక్కడ పని చేసిన భిక్షపతి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

అమీన్‌పూర్ తహసీల్దార్‌గా వెంకటేశ్

అమీన్‌పూర్,మే 21 : అమీన్‌పూర్ తహసీల్దార్‌గా వెంకటేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అమీన్‌పూర్‌లో విధులు నిర్వహించిన తహసీల్దార్ రామస్వామిగౌడ్ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో అక్కడ పనిచేసిన వెంకటేశ్ అమీన్‌పూర్‌కు బదిలీపై వచ్చారు. ఉప తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రఘునాథ్‌రెడ్డి, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అమీన్‌పూర్ తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

రేషన్‌డీలర్లపై చర్యలు తీసుకోవాలి

వట్‌పల్లి, మే 21 : వట్‌పల్లి మండలంలో రేషన్‌డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎప్పుడూ చూసినా దుకాణాలు మూసి ఉండడం, వేళపాలా లేకుండా సరకులు ఇవ్వడం లబ్ధిదారులు ఏమైనా అంటే వారి దబాయించడం పరిపాటిగా మారింది. తాజా మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో స్థానిక డీలర్ తూకం తక్కువవేస్తూ సరుకులు పంపిణీ చేశారు. ప్రజలు దీనిపై ప్రశ్నించగా, దురుసుగా ప్రవర్తించాడు. చేసేదేమీ లేకా కొందరు సరుకులు తీసుకువెళ్లగా, మరికొందరు గ్రామస్తులు నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు మండలంలోని డీలర్లు సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా చూడాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



నల్లవల్లిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న జేఏసీ నేతలు, మహిళలు

గుమ్మడిదల, మే 21 : ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా అక్కడి గ్రామాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు కొనసాగుతునే ఉన్నాయి. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో డంపింగ్‌యార్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను వ్యతిరేకిస్తూ నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల జేఏసీ కమిటీ సభ్యులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 106వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు వల్ల ఇక్కడి పర్యావరణం, భూగర్భజలాలు కలుషితం అవుతాయని వాపోయారు. వెంటనే డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలని వేడుకుంటున్నారు. ఈదీక్షలో జేఏసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి కవితాదేవి

జహీరాబాద్, మే 21 : చట్టాలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా కృషి చేయాలన్నారు. విద్యతో పాటు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బస్వారాజ్, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, లీగల్ సెల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, మే 21 : రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్ష అందిస్తున్న తీరును వార్డులను సందర్శించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ శ్రీధర్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్, మోహీజొద్దీన్, బండి మోహన్ పాల్గొన్నారు.

రికార్డులు తప్పనిసరిగా నమోదు చేయాలి

మనూరు, మే 21 : ప్రతి నెలా గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహిస్తూ రికార్డులను తప్పని సరిగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం కుమార్ అన్నారు. బుధవారం మనూరు ఐకేపీ సమావేశ మందిరంలో ఐకేపీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో అకౌంటె